యూనిట్ పెరిగినా చెల్లించాల్సిందే !

- 200 యూనిట్లకు మించి విద్యుత్ వినియోగంపై కసరత్తు
- గృహజ్యోతి పథకానికి దాదాపు 30 వేల దరఖాస్తులు


దరఖాస్తులు స్వీకరిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

అంబర్‌పేట్: గృహజ్యోతి పథకానికి విద్యుత్‌శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. గత 15 రోజులుగా నియోజకవర్గంలో ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందించేందుకు కావాల్సిన పత్రాలను విద్యుత్ అధికారులు అర్హుల నుంచి తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 65 వేల విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఇప్పటివరకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కోసం సుమారు 30 వేల దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికి అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

◆ విద్యుత్‌శాఖ అధికారులు నియోజకవర్గంలో బతుకమ్మకుంట విద్యుత్ సబ్‌స్టేషన్ అలీకేఫ్ చౌరస్తా, కాచిగూడలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారు. అర్హులు ఇప్పటికీ దరఖాస్తులు చేసుకోవచ్చని విద్యుత్‌శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

నిర్ధారణ కత్తిమీద సామే..

200ల లోపే యూనిట్ల విద్యుత్ వినియోగిస్తున్నట్లు పారదర్శకంగా నిర్ధారించడం విద్యుత్‌శాఖ సిబ్బందికి కత్తిమీద సామే. ఇప్పటికే విద్యుత్ వినియోగించకున్నా అధిక బిల్లులు వేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. దీనిపై అనేక ఫిర్యాదులు వినియోగదారుల నుంచి వస్తునే ఉన్నాయి.

200 యూనిట్లకే ఉచితం..

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వాడిన వారికే ఈ పథకం వర్తిస్తుంది. 201 యునిట్లు వినియోగిస్తే మొత్తం బిల్లు చెల్లించాల్సిందే. 65వేల కనెక్షన్‌లలో దాదాపు సగం మంది వినియోగదారులు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకోవడం గమనార్హం. కనెక్షన్‌లలో దాదాపు సగం రావడంతో పాటు మరిన్ని వచ్చే అవకాశం ఉంది.

అర్హులందరికీ ఉచిత విద్యుత్

200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకునే వారికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఉచిత విద్యుత్ అందేలా కృషి చేస్తాం. అర్హులైన వారు తమ విద్యుత్ కార్యాలయాల్లో దరఖాస్తులను అందించాలి. ఈ పథకంపై సామాన్య ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. – ఏడీఈ శీనయ్య

ఘనంగా భీష్మపితామహుడి జయంతి వేడుకలు


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, పూస రాజు తదితరులు


బోనాలతో మహిళలు, ఆకట్టుకున్న ప్రదర్శనలు

ముషీరాబాద్: గంగపుత్ర ఆరాధ్య దైవం భీష్మ పితామహుడి జయంతి వేడుకలు ముషీరాబాద్ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ చేపల మార్కెట్ నుంచి భీష్మపితామహ విగ్రహాన్ని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ ర్యాలీకి ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటి సీనియర్ నాయకులు ముఠా జైసింహ, బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు పూసరాజు హాజరై భీష్మ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన ర్యాలీ, జెమిని కాలనీ, రాంనగర్ చౌరస్తా మీదుగా పార్శిగుట్ట, 44 బస్టాప్ నుంచి ముషీరాబాద్ గంగపుత్ర సంఘం హాల్ వరకు నిర్వహించారు. ఈ ర్యాలీలో పోత రాజులు, బోనాలు, వివిధ రకాల దేవతామూర్తుల ప్రదర్శన, కోలాటం, యువకుల నృత్యాలతో ర్యాలీ సందడిగా సాగింది. అనంతరం ఎమ్మెల్యే ముఠా గోపాల్, పూస రాజులు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేపల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గంగపుత్రులకు అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. ప్రతి ఏటా భీష్మ పితామహజయంతి వేడుకలను నిర్వహిస్తూ.. గంగపుత్రుల ఐక్యతను పెంపొందిస్తున్నామన్నారు. ముషీరాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అమృత్‌రాజ్, శంకర్, శ్రీరాములు, మీసాల ప్రసాద్, గణేష్, పూస గోరఖ్ నాథ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

◆ అంబర్‌పేట్‌లో జరిగిన జయంతి వేడుకలకు ఆలిండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జ శత్రు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిలుకూరి దేవాలయ కమిటీ చైర్మన్ సౌందర్యరాజన్‌ను కలిసి సన్మానించారు.

'ఎక్స్‌పర్ట్ ఇన్' యాప్ ఆవిష్కరణ


యాప్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: స్టాండర్డ్ టాక్స్ ఫైలింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సంతోశ్ నడిగొట్టు రూపొందించిన 'ఎక్స్‌పర్ట్ ఇన్' యాప్, వెబ్‌సైట్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ యాప్ ద్వారా ఎక్కడికి వెళ్లినా ఎక్స్‌పర్ట్ ఇన్ యాప్ ద్వారా లోకల్ సమాచారం తెలుసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అద్దంకి దయాకర్, సుభాశ్ వేముల, నర్సన్న, శ్రీనివాస్, సంతోశ్ నడిగొట్టు, డాక్టర్ హరి ఎప్పనపల్లి, మర్రి శ్రీనివాస్, నిఖిల్ సాయి, శ్రీనివాస్ చల్లూరి, ప్రవీణ్, తిరుపతి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలి



కాచిగూడ: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకుని ముందుకు సాగాలని వాసవీ ఆర్ట్ థియేటర్స్ చైర్మన్ డాక్టర్ నీలా శ్రీధర్ అన్నారు. వాసవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ జయశ్రీరావు జన్మదినం సందర్భంగా మంగళవారం వాసవీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో స్కూల్ ప్రాంగణంలో ఆమెను ఘనంగా సన్మానించి అభినందించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. శ్రీనివాస్‌రెడ్డి, ఆర్థరం సతీష్, వేణుగోపాల్, జి.పద్మావతి, పద్మశ్రీదేవి పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలి


మాట్లాడుతున్న కె.పార్థసారథి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రస్తుతం దేశంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని దేశాన్ని పాలిస్తున్న పాలకులు రాజ్యాంగ మౌలిక లక్ష్యాలను విస్మరించి రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడులు చేస్తున్నారని ఐలూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణకు విద్యార్థులు ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి న్యాయ విద్యార్థుల సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు న్యాయ విద్యార్థులు తమవంతుగా కృషి చేయాలన్నారు. దేశంలో అత్యధికంగా అణగారిన వర్గాల ప్రజలు జైళ్లల్లో మగ్గుతున్నారని వారికి సరైన న్యాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 50 మిలియన్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని వాటి పరిష్కారానికి సరిపడా కోర్టులు, న్యాయమూర్తులు లేరన్నారు. న్యాయ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి సమాజంలో అంతరాలు పోయేలా కృషి చేయాలన్నారు. హైకోర్టు న్యాయవాది అబీబ్ హుస్సేన్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి అశోక్‌రెడ్డి, స్టాలిన్, రమ్య, సుష్మ, నందిని, శ్యామ్, హరిప్రియ తదితరులున్నారు.

గాంధీనగర్ ఏసీపీ బాధ్యతల స్వీకరణ


ఏసీపీ మొగలయ్య

చిక్కడపల్లి: గాంధీనగర్ సబ్‌డివిజన్ ఏసీపీగా మొగలయ్య బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఏసీపీగా పనిచేసిన రవికుమార్ సీఐడికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో నల్గొండ రాచకొండ కమిషనర్ పరిధిలో ఏసీపీగా విధులు నిర్వహించిన వై.మొగలయ్య బదిలీపై వచ్చారు. ఏసీపీ మాట్లాడుతూ.. గాంధీనగర్, దోమలగూడ, లేక్వ్యూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఎలాంటి ఇబ్బందులున్నా నేరుగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మూడు పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

'వికసిత్ భారత్' ప్రారంభం


వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ అమృత

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక మార్కెట్, కార్ఖానా గల్లీ, బ్రాహ్మణ హాస్టల్ లేన్, మేధా పాఠశాల వీధి తదితరల ప్రాంతాల్లో మంగళవారం వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు, కార్పొరేటర్ అమృత మాట్లాడారు. ప్రధానమంత్రి సంకల్పించిన వికసిత్ భారత్‌లో భాగంగా ఆధార్ అప్‌డేట్, ముద్ర రుణాలు, ఉచిత వైద్యం, జన్‌ధన్ యోజన, ఉజ్వల గ్యాస్ పథకాలను అర్హులైన పేదలకు అందించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.


వైద్య శిబిరంలో బీజేపీ నేత డాక్టర్ ఎస్.గౌతంరావు

కాచిగూడ: బీజేపీ కాచిగూడ డివిజన్ ఆధ్వర్యంలో కాచిగూడలో చేపట్టిన వికసిత భారత్ సంకల్ప యాత్రలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ పాల్గొని ప్రజలకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో వారు పాల్గొని వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుభాష్ పటేల్, సూర్యప్రకాష్ సింగ్, వినోద్‌యాదవ్, అరవింద్, కృష్ణకుమార్, శేర్‌సాగర్, నర్సింగ్‌రావు, భీమ్‌రాజ్, ఆర్. సంతోష్, ఎస్.రవియాదవ్, సూరి, సీతారామ్, రాజ్‌కుమార్, బల్వీర్, దిలీప్, వాసు తదితరులున్నారు.

పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


పురస్కారాన్ని అందుకుంటున్న విజయ్‌వర్మ పాకలపాటి

కాచిగూడ: పార్టీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కష్టపడి పనిచేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన నియోజకవర్గ కో– కన్వీనర్లను ప్రకటించారు. అంబర్‌పేట అసెంబ్లీ కో– కన్వీనర్లుగా ఎస్.అరవింద్ కుమార్, ఎ.మహేష్, కె.శిరీష, నాంపల్లి అసెంబ్లీ కో –కన్వీనర్లుగా ఎం.బాబురావు, శ్రీనివాస్, ఎస్.సుజాత, ఖైరతాబాద్ అసెంబ్లీ కో –కన్వీనర్లుగా రమేష్, ఎ.లక్ష్మణ్‌రావు, విజయ తులసి, జూబ్లీహిల్స్ అసెంబ్లీ కో– కన్వీనర్లుగా సి.మహేష్, ఎ.శాంతికుమార్, సుప్రీయగౌడ్‌లను నియమించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బీజేపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్‌తో పాటు కేంద్రంలో బీజేపీ జెండా ఎగురవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో సమగ్ర భూసర్వే చేపట్టి ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు. భూమి లేని పేదలకు సాగుకు, ఇళ్ల స్థలాలకు అర్హులైన వారికి పంపిణీ చేయాలని కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. 2016లో జరిపిన సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా 30 లక్షల కుటుంబాలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు లేవని గత ప్రభుత్వం ప్రకటించిందని వీరంతా అద్దె ఇళ్లల్లోనే ఉంటున్నారన్నారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వడంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. వారు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే సమగ్ర భూ సర్వే జరిపి అసైండ్, సీలింగ్, పోడు భూములను అర్హులైన వారందరికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి పేదలకు పంపిణీ చేయాలన్నారు. భూ పోరాటం సందర్భంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని భూ చట్టాల్లో లోసుగులను తొలగించాలన్నారు. సీఐటీయూ నాయకులు భూపాల్, సీపీఎం నాయకులు నాగయ్య, నర్సింహ్మారావు, ఆర్.వెంకటరాములు, ఎం.డీ.అబ్బాస్, మల్లు లక్ష్మి, సాగర్, ఆశయ్య, సైకిలాబ్‌బాబు, కోట రమేష్ తదితరులున్నారు.

ప్రొఫెసర్ కోదండరాంతో బుక్‌ఫెయిర్ నిర్వాహకులు



కవాడిగూడ: తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను మంగళవారం ఆయన నివాసంలో బుక్‌ఫెయిర్ నిర్వాహకులు కలిశారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది నిర్వహించే బుక్‌ఫెయిర్‌కు మెరుగైన సౌకర్యాల కల్పనకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో బుక్‌ఫెయిర్ కార్యదర్శి ఆర్. వాసు తదితరులున్నారు.

గురుకుల నియామకాల్లో అవరోహణను పాటించాలి


ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులు

కవాడిగూడ: గురుకుల ఉపాధ్యాయుల నియామకాల్లో అవరోహన క్రమం (పెద్ద ఉద్యోగాల నుంచి చిన్న ఉద్యోగాల భర్తీ) డిమాండ్ చేస్తూ.. తెలంగాణ అన్ ఎంప్లాయిస్ అండ్ ప్రైవేటు ఫిజికల్ ఎడ్యూకేషన్ టీచర్స్, గురుకుల 1:2 (నిష్పత్తి) అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మాదగోని సైదులుగౌడ్, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, నాయకులు అశోక్ మాట్లాడుతూ.. గురుకులాల్లో ఏకకాలంలో భర్తీ చేస్తున్న ఉపాధ్యాయ నియామకాల్లో అవరోహన క్రమం పాటించకుండా రెండు మూడు ఉద్యోగాలకు సెలక్ట్ అయిన అభ్యర్థుల నుంచి రీలింక్విష్‌మెంట్ తీసుకోకుండా నియామకాలు చేపట్టడం ద్వారా కొన్ని ఉద్యోగాలు బ్యాక్‌లాగ్‌లో మిగిలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల 1:2 లిస్టులో సెలక్ట్ అయిన అభ్యర్థులు వారికి రావాల్సిన ఉద్యోగాలు కోల్పోతున్నారన్నారు. 1:2 సెలెక్టెడ్ అభ్యర్థులతో నోటిఫికేషన్‌లో ప్రకటించిన ఉద్యోగాలు మొత్తం భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ నిరుద్యోగ ప్రైవేటు ఫిజికల్ ఎడ్యూకేషన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. అభ్యర్థులు రాజ్‌కుమార్, అస్మా, శ్రీనివాస్, బాలరాజు, విఠల్, పూసపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ మాజీ ఎమ్మెల్యే ఎండెల లక్ష్మీనారాయణ హాజరై మద్దతు ప్రకటించారు.

'విశ్వగురు సేవా పురస్కారం' ప్రదానం

కాచిగూడ: సినీ నిర్మాత, దర్శకుడిగా వివిధ సామాజిక కార్యక్రమాలతో దేశస్థాయిలో ఎన్నో ప్రశంసలు పొందిన విజయ్‌వర్మ పాకలపాటికి మరో అత్యున్నత పురస్కారం లభించింది. ప్రతిష్టాత్మక విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ గ్రామస్థాయి నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తనవంతు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుంది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేణుగోపాల్ ఈ పురస్కారం ప్రదానం చేసి అభినందించారు. సంస్థ వ్యవస్థాపకులు సత్యవోలు రాంబాబు, రిటైర్డ్ ఐఏఎస్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

వద్దిరాజు రవిచంద్రకు అభినందన


రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా అభినందిస్తున్న డాక్టర్ కొండ దేవయ్య

కాచిగూడ: బీఆర్ఎస్ పార్టీ నుంచి రాజ్యసభకు ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను మంగళవారం మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండ దేవయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్.వి.మహేందర్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతినిధులు ఘనంగా సత్కరించి అభినందించారు. మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వద్దిరాజు రవిచంద్రను రెండోసారి రాజ్యసభకు ఎంపిక చేసిన మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో మున్నూరుకాపులకు మరిన్ని అవకాశాలు కల్పించాలని వారు కోరారు.

'మాదిగలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'


మాట్లాడుతున్న వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ముషీరాబాద్: గత ప్రభుత్వాలు మాదిగలను విస్మరించాయని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగల పట్ల చిత్తశుద్ధిని చాటుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో మాదిగ మహిళ సమాఖ్య రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ మాదిగలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. డప్పులు కొట్టే వారికి చెప్పులు కుట్టే వారికి కులవృత్తిదారులకు నెలకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలకు రాజకీయ రంగాల్లో అవకాశాలు ఇవ్వకుండా గత ప్రభుత్వాలు మోసం చేశాయన్నారు. మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని, నామినేటెడ్ పోస్టుల్లో మాదిగలకు అవకాశాలు ఇవ్వాలని కోరారు. దళిత బంధు పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని ఎంపిక చేసిన వారికి వెంటనే మంజూరు చేయాలన్నారు. భాస్కర్, రమేష్, గణేష్, వేణుగోపాల్, కృష్ణ, మేరీ, అండాలు, శ్రీనివాస్, వెంకటేష్, వరలక్ష్మి, మహేశ్వరి, లావణ్య, రూప, విమలత, పూర్ణిమ, మల్లేశ్వరి, సుజాత, భాగ్యమ్మ, సువర్ణ, రాధా తదితరులున్నారు.

జోడోయాత్రను విజయవంతం చేయాలి..

కవాడిగూడ: తెలంగాణలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్లను కల్పించాలని, మాదిగలకు రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం పిలుపునిచ్చారు. మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జోడో యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ.. 30 ఏళ్ల మాదిగల ఉద్యమాన్ని ఎన్నికల లబ్ధికోసం అపహాస్యం చేసిన బీజేపీని తెలంగాణలో అంతం చేయడమే లక్ష్యమన్నారు. మాదిగలపై చిత్తశుద్ధి ఉంటే వర్గీకరణ చేయాలని లేనిపక్షంలో 17 పార్లమెంటు స్థానాల్లో బీజేపీని ఓడిస్తామన్నారు. గడ్డ యాదయ్య, నర్సింహ్మారావు, బాబురావు, చంద్రశేఖర్, మల్లేష్, నరేష్, డాక్టర్ సంజీవనాయక్, శైలేందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర కీలకం


సిరిపురం యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అంబర్‌పేట్: తెలంగాణ ఉద్యమంలో విద్యార్థుల పాత్ర ఎనలేనిదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వెంకట్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద తెలంగాణ ఉద్యమంలో అమరుడైన సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యమంలో విద్యార్థుల త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. నాయకులు గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివక్షలేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్

కాచిగూడ: వివక్షలేని సమతా ప్రపంచ నిర్మాణానికి పౌర సమాజం కృషి చేయాలని ఇంటర్నేషనల్ సోషల్ జస్టిస్ ఫోరం చైర్మన్, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. మానవ సమాజం మధ్య ఎలాంటి వివక్షత, అణిచివేత, కుల,మత, లింగ తదితర వివక్షతలు లేకుండా.. ప్రపంచ పౌరసమాజం అంతా సమానత్వం, ఆత్మగౌరవంతో జీవించాలని ఐక్యరాజ్య సమితి యుఎన్‌ఓ 2007లోనే తీర్మానం చేసిందన్నారు. సామాజిక న్యాయం అందకపోతే.. దేశాలు, సమాజం మధ్య అంతర్యుద్ధం వస్తుందని ప్రపంచ దేశాలకు యూఎన్‌ఓ హెచ్చరిక చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సోషల్ జస్టిస్ సాధన కోసం తీవ్రంగా కృషి చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పోరాట స్ఫూర్తిని ప్రపంచం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డీవీఎల్ రాజు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరం సతీష్‌కుమార్, గణేష్, జేఎస్ రావు, రాజలింగం, చిప్పరి కరుణాకర్, ఎం.ప్రవీణ్ తదితరులున్నారు.

భారతీయ సంప్రదాయాలు విశిష్టమైనవి

చిక్కడపల్లి: భారతీయ సాంస్కృతిక సంప్రదాయాలు విశిష్టమైనవని చేనేత వర్గాల శివరామ దీక్షితాచల పీఠాధిపతి, ఓంకార్‌సత్సంగ్ అధినేత డాక్టర్ చిక్కాదేవదాస్ అన్నారు. మంగళవారం స్వదేశీ పర్యటనలో భాగంగా ఉత్తరప్రదేశ్ ప్రయాగలో అష్టాదశ శక్తిపీఠాల్లో 14వ శక్తిపీఠం మాధవేశ్వర ఆలయం ఎంతో పవిత్రమైందన్నారు. ఈ ఆలయంలో విగ్రహం ఉండదని, అష్టాదశ శక్తి పీఠమని, నాలుగు దిక్కుల సమానంగా నిర్మించిన పీఠం మాత్రమే ఉంటుందని వివరించారు.

అధిక ధరలకు టికెట్లు వసూలు


మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి ఎం.శ్రీనివాస్

ముషీరాబాద్: ఒప్పందాలకు విరుద్ధంగా అధికరేట్లకు ఎల్‌అండ్‌టీ మెట్రోరైల్ సంస్థ టికెట్లు వసూలు చేస్తుందని, ప్రయాణికులకు సరైన సదుపాయాలు కల్పించడం లేదని సీపీఎం హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రీనివాస్ ఆరోపించారు. మంగళవారం గోల్కొండ చౌరస్తాలోని కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కాగ్ అంచనా ప్రకారం 2020 నాటికి రూ.213 కోట్లు ఎల్‌అండ్‌టీ అదనంగా వసూలు చేసిందని ఇప్పటి వరకు లెక్కలు వేస్తే రూ.500ల కోట్లకుపైగా చేరుకుంటుందని అభిప్రాయపడ్డారు. మెట్రో స్టేషన్‌ల నిర్మాణం విస్తీర్ణం తగ్గించి నిర్మించడంతో ఎల్‌అండ్‌టీ సంస్థకు రూ.227 కోట్ల లబ్ధి చేకూరిందని విమర్శించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. శ్రీనివాసరావు, మహేందర్ తదితరులున్నారు.

ఆదివాసీలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ధర్నా


ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న కొమరం భీం కాలనీ ఆదివాసీలు

కవాడిగూడ: ఆదిలాబాద్ జిల్లాలోని మావల మండలం బట్టి సావర్‌గాం శివారు సర్వేనెంబర్ 72/22, 72/23లో ఉన్న ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకున్న 2043 మంది నిరుపేద ఆదివాసులకు జీవో నెంబర్ 58 ప్రకారం ఇళ్ల పట్టాలను మంజూరు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం తుడుం దెబ్బ అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ... భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా.. ఆదివాసీలకు న్యాయం జరగడం లేదని, రోడ్డు రవాణా సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. రాష్ట్ర నాయకులు గోడం గణేష్, తుడుం దెబ్బ కార్యదర్శి కొడప నగేష్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు సాగబోయిన పాపారావు, తుడుం దెబ్బ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బాపూరావు, నేతలు చలపతి, సోయంజంగ్, గోడం రేణుక, పుష్పారాణి, లలితాబాయి, జంగుబాయి, తానాజీ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్న మహిళ రిమాండ్


సాదియా నయీమా సుల్తానా

కాచిగూడ: బెదిరింపులకు పాల్పడుతూ.. డబ్బులు డిమాండ్ చేస్తున్న ఓ మహిళను కాచిగూడ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రామలక్ష్మణరాజు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట ప్రాంతానికి చెందిన సయ్యద్ అహ్మదుద్దీన్ కుమార్తె సాదియా నయీమా సుల్తానా (30) సైదాబాద్‌లో నివాసం ఉంటుంది. ఇటీవల బర్కత్‌పురలోని అన్నపూర్ణ ఉమెన్స్ హాస్టల్‌లో రూమ్ అద్దెకు తీసుకుంది. రాత్రిపూట హాస్టల్‌కు రావడంతో అనుమానం వచ్చిన హాస్టల్ యజమాని ఆధార్‌కార్డు అడిగితే ఉదయం ఇస్తానని నమ్మబలికి 15 రోజులైన ఆధార్ ఇవ్వకుండా, అద్దె చెల్లించకుండా తిరుగుతోంది. రోజూ రాత్రి 11 గంటల సమయంలో బయటకు వెళ్లి తిరిగి ఉదయం 8 గంటల సమయంలో హాస్టల్‌కు వచ్చేదని, రాత్రి బైక్, కార్లలో వెళ్తున్న వారిని లిఫ్ట్ అడిగి కొంతదూరం వెళ్లిన తర్వాత భయభ్రాంతులకు గురిచేస్తుండేదని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో హాస్టల్ యజమాని ఆమె ప్రవర్తన నచ్చక రూమ్ ఖాళీ చేయమని చెబితే తన వద్ద రూ.60వేలు తీసుకుని వేధింపులకు గురిచేస్తున్నాడని ఆమె కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు హాస్టల్ యజమానిని విచారించగా.. జరిగిన విషయం మొత్తం వివరించాడు. అతడి ఫిర్యాదు మేరకు కాచిగూడ పోలీసులు కేసు నమోదు చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు. గతంలో ఆమెపై పలు పోలీస్‌స్టేషన్లలో 16 కేసులు ఉన్నట్లు సమాచారం.

తప్పుడు అడ్రస్‌లతో మోసం.. ఒకరి అరెస్ట్

పరారీలో మరో నిందితుడు

చిక్కడపల్లి: ప్రజలను నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ఓ ముఠాను చిక్కడపల్లి పోలీసులు ఛేదించారు. ముఠాలోని ఇద్దరిలో ఒకరిని మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నగరంలోని సంతోష్‌నగర్ ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ అలీ కుమారుడైన మహ్మద్ సల్మాన్ అలీ అలియాస్ సల్మాన్ అగ(23) వృత్తి డ్రైవింగ్. కాగా అతడు మరో వ్యక్తి మహ్మద్ అబ్దుల్ సోయబ్‌తో కలిసి జూమ్‌కార్ యాప్‌లో తప్పుడు అడ్రస్సు ప్రూఫ్ అప్‌లోడ్ చేసి ప్రజలను నమ్మించి కారు బుక్ చేసుకుని దానిని సెల్ఫ్ డ్రైవింగ్ ద్వారా తీసుకెళ్లి అనంతరం కారున్న జీపీఎస్ లొకేషన్ తొలగించి కారును సదరు యజమానికి ఇవ్వకుండా తమ సొంత అవసరాలకు వాడుకుని జల్సాలకు వాడుకోవడానికి అలవాటుపడ్డారు. కారు ఇతరులకు బుకింగ్స్ ఇచ్చుకుంటూ.. వారు యజమానిని మోసం చేస్తూ.. వస్తున్నారు. గత కొంతకాలంగా ఈ విధంగా మోసాలకు పాల్పడుతున్న ఈ ముఠాకు సంబంధించిన సదరు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుల్లో ఒకరైన మహ్మద్‌సల్మాన్ అలీ అలియాస్ సల్మాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రెండు గూగుల్ మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నామన్నారు.